గురింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 5 : జిల్లా వ్యాప్తంగా అనుమతులు, గుర్తింపు లేకుండా పాఠశాలలను నిర్వహించడమే కాకుండా అడ్మిషన్ల కోసం బ్యానర్లు, ఫ్లెక్సీలతో యాజమాన్యాలు ప్రచారం చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్న యాజమాన్యాలపై ఎంఈవోలు, డీఈవో స్పందించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పలు పాఠశాలలపై ఇది వరకే ఎంఈవో, డీఈవోకు వినతి పత్రం అందజేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రాహుల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అంశాలను మేనిఫెస్టోలో పెట్టాలి

- కాంగ్రెస్, బీజేపీలకు లేఖ

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 5 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, బీసీల అంశాలను మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు ప్రధాన మంత్రి మోడీ, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. దేశంలో, రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం బీసీల అంశాలను నెరవేర్చిన దాఖలాలు లేవని, పార్లమెంట్ ఎన్నికల్లో నైనా బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీల అంశాలను మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికల్లోకి రావాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగే బీసీల సామాజిక రక్షణ భద్రతకు బీసీ యాక్ట్ ఏర్పాటు చేయాలని, బీసీల్లో రోస్టర్ విధానం అమలు చేసి ఎస్సీ, ఎస్టీ లాగే బ్యాక్‌లాగ్ పోస్టులు బీసీలకు వర్తింప చేయాలని, బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు బొడెంకి మహేశ్, జిల్లా నాయకులు రాసమల్ల కుమార్, కీర్తి, భిక్షపతి, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీశ్, ఆడెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్ : చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దళిత సంఘాల నాయకులు

చెన్నూర్ : చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు

బెల్లంపల్లి : చిత్రపటానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

యువతకు స్ఫూర్తిదాయకం బాబూ జగ్జీవన్‌రాం

- జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు
- కార్యాలయాల్లో చిత్రపటాల వద్ద నివాళి

మంచిర్యాల టౌన్ : గుడిపేట బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న కమాండెంట్ జమీల్ బాషా

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను శుక్రవారం మంచిర్యాలలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ జీవితం నేటితరం నాయకులు, యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. పేదకుటుంబంలో జన్మించిన ఆయన అంకురిత దీక్షతో అత్యున్నత స్థాయికి ఎదిగారని , స్వాతంత్ర్యానంతరం అనేక మంత్రి పదవులకు వన్నె తెచ్చారని, అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడాడని, దళితుల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని పలువురు నాయకులు, అధికారులు గుర్తుకుచేసుకున్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గుడిపేట బెటాలియన్‌లో కమాండెంట్ జమీల్‌బాషా, ఆర్ఐలు రవి, శ్రీనివాస్, మారుతీ, కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో గణపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, సంఘం నాయకులు రామ్మోహన్, శ్రీపతిబాపు, పొన్న మల్లయ్య, కేజియా రాణి, రాంకుమార్, శ్రావణ్, యూసుఫ్, నాగుల గోపాల్, ప్రకాశ్, వేణు, తదితరులు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 5 : పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు మోతె పోచం, రామగిరి భానేశ్, గుడిసెల దశరథం, సిరికొండ బోస్, జిల్లంపెల్లి వెంకటేశ్, బెక్కం రాజారావు, ఎలుకపల్లి మల్లేశం, గుడిసెల రాజారాం, ఆసంపెల్లి నగేశ్, నరేశ్, గడ్డం సత్యం, గడ్డం సాయి, సహస్ర తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, ఏప్రిల్ 5 : దండేపల్లి మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, తదితరులున్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, ఏప్రిల్ 5 : కోటపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఏపీవో బండం బాలయ్య, టైపిస్ట్ సాత్విక్, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ రాజు, ఆపరేటర్ రాజు తదితరులున్నారు.

చెన్నూర్‌లో

చెన్నూర్, ఏప్రిల్ 5: చెన్నూర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జగ్జీవన్‌రాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్, నాయకులు శ్రీధర్, రాజు, రాజేశ్, సతీశ్, సదువు శేఖర్, రాజన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి రూరల్, ఏప్రిల్ 5: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఏఈ సందీప్, టీవో ఆశ్రిత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో వేడుకలను నిర్వహించారు.

వేమనపల్లిలో

వేమనపల్లి, ఏప్రిల్ 5 : వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది లవన్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్, ఏప్రిల్ 5 : ఎంపీడీవో, తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, అధికారులు, నాయకులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో..

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 5: నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారంలో..

జన్నారం, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటిమల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సంఘం నాయకులు బోర్ల కుంట ప్రభుదాస్, ఏ దేవయ్య, మామిడిపెల్లి ఇందయ్య మహారాజ్, దుమల్ల రమేశ్, శీను, భాస్కర్‌గౌడ్, ముల్కల్ల ప్రభాకర్ తదితరులున్నారు.

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, ఏప్రిల్ 5: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, ఎంఈవో రవీందర్, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్‌తో పాటు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. రంగపేట అంబేద్కర్ కాలనీలో వేడుకలను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు చిప్పకుర్తి నారాయణ, తోటపల్లి మహేందర్, కలమడుగు సిసింద్రి, మల్లేశ్, నర్సయ్య, సత్తయ్య, వెంకటేశ్, సతీశ్, కిషన్, శ్రీకాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి, ఏప్రిల్ 5: మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు మున్సిపల్ ఏఈ అచ్యుత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీ శ్యాంసుందర్, టీఎంసీ రఘురాం, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బీ.శ్యాంబాబు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎం.గోపీకృష్ణ, ఆవునూరి శంకర్, కాసర్ల రాజలింగు, దుర్గం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట, ఏప్రిల్ 5 : కాసిపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జాడి పోశం, సలహాదారులు పల్లె మల్లయ్య, మద్దినేని చిన్న భీమయ్య, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి కొమ్ముల బాపు, తట్ర భీంరావు, సహాయ కార్యదర్శి దుర్గం రాంచందర్, లంక లక్ష్మణ్, రాంటెంకి వాసుదేవ్, నవనందుల తిరుపతి, మైదం రమేశ్, కరీం, రత్నం భానయ్య పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంతో పాటు, తహసీల్ కార్యాలయంలో, బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లోఎంపీడీవో రాధ రాథోడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఆత్కూరి రాము, దుర్గం లాసర్, వడ్ల కొండ కిష్టయ్య, గుడిమల్ల నరహరి, జలంపల్లి తిరుపతి, దళిత నాయకులు గాలిపల్లి నాగభూషణ్, కుంటల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పోడెటి రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్, ఏప్రిల్ 5 : శ్రీరాంపూర్ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గద్దెల భానయ్య, జిల్లా కో కన్వీనర్ సుందిల్ల మల్లేశ్, నియోజక వర్గ కో ఆర్డినేటర్ మంతెన మల్లేశ్, నియోజకవర్గ కన్వీనర్ చుంచు శంకర్‌వర్మ, నాయకులు నాంపల్లి స్వామి, మధు, రాయమల్లు, భూమయ్య, నెలవేణి మధునయ్య, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

జైపూర్‌లో..

జైపూర్, ఏప్రిల్ 5: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీడీవో గడ్డం సత్యనారాయణ, ఎంపీవో అనిల్ కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓరియంట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ఆశ్రమంలో వస్తువులను అందిస్తున్న ఓరియంట్ అధికారులు

కాసిపేట, ఏప్రిల్ 5 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీ ప్రెసిడెంట్ సత్యబ్రత శర్మ, యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి నేతృత్వంలో ఓరియంట్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈసీజీ మిషన్, కరెంట్ బ్యాకప్ బ్యాటరీలు, వీల్ చైర్, స్ట్రెచర్, 10 బీపీ మిషన్స్, ఆర్‌వో వాటర్ ప్లాంట్ అందించారు. దేవాపూర్ పంచాయతీలోని ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్‌లో వాటర్ స్టోరేజ్ బ్యాంక్, రోగులకు పరుపులు, మెత్తలు, బెడ్ షీట్లు, స్టూల్స్, చెకింగ్ స్క్రీన్ అందించారు. దేవాపూర్ ప్రభుత్వ హై స్కూల్‌కు బోర్ పంపు, ఆర్‌వో వాటర్ ప్లాంట్, వాటర్ స్టోరేజ్ ట్యాంకులు, యూరినల్ బేసిన్స్ అందించారు. దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలకు బెంచీలు, డెస్కులు, గ్రీన్ బోర్డు, ఆట వస్తువులు అందించారు. బెల్లంపల్లిలోని అమ్మా అనాథ శరణాలయానికి సంవత్సరానికి సరిపడా రూ.2.80 లక్షల విలువైన భోజన సామగ్రి, వాటర్ కూలర్, వాటర్ ప్యూరిఫయర్, 16 పరుపులు, ఆట వస్తువులు అందించారు. మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ ఆశ్రమంలోని అనాథ పిల్లలు, వృద్ధులకు కూలర్, డొమెస్టిక్ డ్రింకింగ్ వాటర్, ప్యూరిఫయర్, రూ.3 లక్షల విలువ గల భోజన సామగ్రి అందించారు. ఈ మేరకు ఓరియంట్ యాజమాన్యానికి ఆయా సంస్థలు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ కంపెనీ లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి, ఓరియంట్ అధికారులు పాల్గొన్నారు.

బాధిత చిన్నారులకు ఆర్థిక సహాయం

బాధిత చిన్నారులతో ఫౌండేషన్ సభ్యులు

మందమర్రి, ఏప్రిల్ 5: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులకు పద్మావతి వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక చేయూతనందించారు. శుక్రవారం రెండవ జోన్ కాలనీలోని బాధితుల ఇంటికి వెళ్లిన ఫౌండేషన్ సభ్యులు దాతల సహకారంతో సేకరించిన రూ.12 వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యాన్ని అనాథ చిన్నారులు హార్థిక్, కార్తికేకు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు వడ్లకొండ రంజిత్ గౌడ్ మాట్లాడుతూ చిన్నారులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ ఏరియా వ్యాపార కమిటీ అధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేశ్, బుర్ర ఆంజనేయులు, సట్ల సంతోష్, మహంతి అర్జున్, మంద తిరుమల్ రెడ్డి, సతీశ్, కిరణ్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో శ్రమదానం

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : గ్రంథాలయంలో పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో పోటీ పరీక్షల అభ్యర్థులే పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. గ్రంథాలయాధికారి ఉప్పు గోపీ వెంటనే మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లారు. అయినా పట్టించుకోకపోవడంతో పోటీ పరీక్షల అభ్యర్థులే ముందుకు వచ్చి శ్రమదానం చేశారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

నెన్నెల, ఏప్రిల్ 5: నెన్నెలలోని లంబాడీతండాకు వెళ్లే రోడ్డుపై బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో నెన్నెల నుంచి లంబాడీ తండాకు చెందిన బానోత్ బలరాం, ధరావత్ నవీన్ గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌ను అతి వేగంగా నడపడంతో ఒక్క సారిగా అదుపు తప్పింది. బలరాం, నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి దవాఖానకు తరలించగా బలరాం చికిత్స పొందుతూ మృతి చెందాడు. తలకు తీవ్ర గాయమైన నవీన్‌ను కుటుంబసభ్యులు మంచిర్యాలకు తరలించారు.

మహిళ మృతికి కారకుడైన అంబులెన్స్ డ్రైవర్ అరెస్ట్

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రత్నపురం ప్రకాశ్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 5: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మహిళ ప్రాణాలు పోవడానికి కారకుడైన అంబులెన్స్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల ఏసీపీ రత్నపురం ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జైపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన తోకల సాగర్ ప్రస్తుతం మంచిర్యాల లక్ష్మీనగర్‌లో ఉంటూ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులను అత్యవసర చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానలకు తరలించేవాడు. గత నెల మార్చి 29న రోడ్డు ప్రమాదంలో గాయపడిన మ్యాదరి సింధుజను (35) మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అంబులెన్స్ డ్రైవర్ సాగర్‌ను సంప్రదించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు చెప్పిన హాస్పిటల్‌కి కాకుండా మంచిర్యాలలోని వసుధ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ వైద్య పరీక్షలకు సుమారు అరగంట సమయం గడిచింది. పరిస్థితి విషమించడంతో పేషంట్ బంధువులు కరీంనగర్‌లోని కెల్విన్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని డ్రైవర్‌కు చెప్పగా మరలా వారి మాటను వినకుండా అప్పటికే కమీషన్ ఒప్పందం కుదుర్చుకున్న అకిరా హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ వైద్యపరీక్షలకు దాదాపు 45 నిమిషాలు సమయం గడిచిపోయింది. ఆ హాస్పిటల్‌లో వసతులు, డాక్టర్లు లేకపోవడంతో బంధువుల మొదట చెప్పిన కెల్విన్ హాస్పిటల్ తీసుకువెళ్లారు. అక్కడ చేర్పించిన తర్వాత కొద్ది సమయానికే చికిత్స అందిస్తుండగా రోగి బ్రెయిన్ డెడ్ అయింది. అరగంట ముందు తీసుకవస్తే పేషెంట్‌కి ఈ పరిస్థితి వచ్చేది కాదని వైద్యులు తెలిపారు. అనంతరం బ్రెయిన్ డెడ్ అయిన సింధుజని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఏప్రిల్ 1న మృతి చెందింది. అంబులెన్స్ డ్రైవర్ ఆలస్యం, నిర్లక్ష్యంతోనే సింధుజ చనిపోయిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడు సాగర్ అంగీకరించడంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. డబ్బుల కోసం రోగుల ప్రాణాలను నిర్లక్ష్యం చేసే అంబులెన్స్ డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐ బన్సీలాల్, ఎస్ఐ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ నిందితుల అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ అల్లం నరేందర్

దండేపల్లి, ఏప్రిల్5: దండేపల్లి మండల కేంద్రంలోని మాలగాని మల్లన్న గుడిలో గురువారం జరిగిన దొంగతనం, అదే రోజు అంబేద్కర్ చౌరస్తాలో షేక్ హాజీకి చెందిన ఆటో ట్రాలీ దొంగతనం కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ అల్లం నరేందర్ తెలిపారు. శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. శుక్రవారం గూడెం చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోలో వచ్చిన వ్యక్తులను పట్టుకున్నామన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం రేకూర్తి గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్య, కరీంనగర్ హనుమాన్‌నగర్‌కు చెందిన పత్తి కనకరాజును పట్టుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఆటో ట్రాలీ, మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. వీరిని పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ స్వరూప్‌రాజ్, సిబ్బంది ఉన్నారు.

రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్, ఏప్రిల్ 5: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్ఐ రమేశ్ తెలిపారు. తాండూర్ మండలం ద్వారక కాసిపేటకు చెందిన అప్ప అక్షయ్‌కుమార్, రేచినిరోడ్ కు చెందిన ఇందూరి శ్రీనివాస్ 5.2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాటా ఏస్ మ్యాజిక్ మహారాష్ట్రకు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

తాండూర్, ఏప్రిల్ 5 : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా మార్కెటింగ్ అధికారి, తాండూర్ స్పెషల్ ఆఫీసర్ గజానంద్ అన్నారు. మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఎంపీడీవో పీ శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డుపై గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించారు. మాదారం5 ఇంక్లైన్ గ్రామంలో మంచి నీటి సమస్య గురించి తెలుసుకుని సమస్యను సత్వరమే పరిష్కరింపచేయించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షల్లో చెన్నూర్ విద్యార్థులకు అవార్డులు

అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

చెన్నూర్, ఏప్రిల్ 5: సూచిర్ ఇండియా ఫౌండేషన్ వారు సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ కోసం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షల్లో చెన్నూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. పట్టణంలోని న్యూలయోల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్ మోక్ష, పీ శ్రీలక్ష్మి, రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన విద్యార్థి జేగాటి ప్రణీత్ విజేతలుగా నిలిచారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్డీడీవో సీఈవో జీ సతీశ్‌రెడ్డి, సినీ గేయ రచయిత చంద్రబోస్, సూచిర్ ఇండియా సంస్థ అధ్యక్షుడు వై కిరణ్, మంచిర్యాల జిల్లా కో-ఆర్డినేటర్ పుప్పాల ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. 22 సంవత్సరాలుగా విద్యారంగంలో అందిస్తున్న సేవలకు గాను పట్టణంలోని రైసింగ్ సన్ పాఠశాల కరస్పాండెంట్ ఖాజా ఖంరొద్దీన్‌కు గురుబ్రహ్మ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.

నియామకం

జునుగురి మల్లేశ్

జన్నారం, ఏప్రిల్ 5 :మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన సీనియర్ నాయకుడు జునుగూరి మల్లేశ్‌ను గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నియమించినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్ తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం నియమించినట్లు చెప్పారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జన్నారం, ఏప్రిల్ 5 : మండలంలోని ఇందన్‌పెల్లి, మురిమడుగు, దేవునిగూడ, కవ్వాల్, రోటిగూడ, రాంపూర్, కలమడుగు గ్రామాల్లో డీఆర్‌డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ ప్రారంభించారు